# సయించు గొడవ

నేనూ భద్రమూ కూచుని కాస్సేపు బీడీలు వెలిగించి ఒకళ్ళ మొహాన ఒకళ్ళం పొగఊది తరవాత పుస్తకాల అమ్మకాలు చూడటం మొదలు పెట్టాం.

"భద్రం?"

"గురో?"

"మన 'ఆవుకు తోకుంటుంది' ఎన్ని కాపీలు అమ్మినై?"

"మూడేలు."

"వాండ్రుఫుల్ భద్రం, వాండ్రుఫుల్. మన 'స్ఫూర్తికయేట'కు యెవిజెంట్లంతా డబ్బుమీద చెక్కులు పంపారా?"

"పంపిస్తూ, పంపిస్తూ ఉన్నారు గురో. ప్రింటు రేపటితో ఎత్తేస్తారుట. పై పుస్తకం పేరు అట్టలోపల ఎయ్యటానికి రాసి పంపీమంటున్నాడు ప్రెస్సాయిన."

"అతోశ్మ, అతోశ్మ. కొత్తప్లాటే ఆలోచించలేదు, భద్రం!"

"అదెంతసేపు గురో! నాలుగు కూలూలు అల్లేశామంటే ప్లాటు కుదిరిందన్నమాటే!"

నేను విచార నదిలో మునిగి అడుక్కుపోయాను. మా ఊరిపక్క బురమేట్లోనన్నా ఈతలుకొట్టానుగాని, ఈ విచారనదిలో ఈదటం చాతగావటంలేదు.

"ఆరోజులే మంచివి. భద్రం" అన్నాను పెద్ద హూర్పులాగి.

"ఏ రోజులు గురో?"

"అప్పుడే మరిచావా? మెట్లమీద టకటక—సబ్బా, సూపరూ మనని ట్రంకు చెయ్యటం—నే నా డిటెక్టివు క్లబ్బు కెళ్ళినరోజు—హంతా ఏదో జనమల్లేవుంది. ఇప్పుడంతా క్లూలు పోగుచెయ్యటం. నువ్వు గోతి పారెయ్యటం—! నిజమైన అంతకులేరి? హపరాద పరిశోధ నేది?"

"ఇదే బాగుందిలే, గురో! మన సందుమలుపు బీడీకొట్టాయన అడుపించాడు. 'ఏందయ్యా చిత్తరం? మా మీద బొత్తిగా శీతకన్ను యేసినావే?' అన్నాడు. 'ఏంది కత?' అన్నా. 'మీ కేయాజుగారి పుత్తకం నాకూ్కడా ఓటి ఇప్పియరాదెట్టా' అన్నాడు. 'ఏమిం స్తావూ?' అన్నా. 'అయిజ్జేసుకో.' అన్నాడు. 'పదికి తగ్గవేం!' అన్నా. బొత్తిగ బక్కాణ్ణయిపోతినే! నిన్ననైతే ఇచ్చేపనేగాని, ఒక వెయ్యి బీడీలు కొనుక్కొచ్చా. 'డబ్బు తక్కువగా ఉండది.' అన్నాడు. నా అంతట నేనే ఒకప్లాటేసి గికి పారేద్దామా అనుకున్నా. కాని మళ్ళీ మీ పేరుకాస్తా పాడయిపోతుందని అనుమానించా!"

దీనికి ఏమనాలో ఆలోచించేటంతలో ఒక పెద్ద ఉరుము ఉరిమి మేఘం లోపలికి

వచ్చింది. అంటే.... 'ఏ పల్లుడోవ్ !' అని కేక పెడుతూ కుంటుకుంటూ గవరయ మాఁవ వచ్చాడు.

"ఏం మాఁవా ? కనబడి శాన్నాళ్ళాయె !" అన్నా.

"అప్లీడరింటి గోడమీదిగా గెంతటంతో కాలు కాస్త బెణికిందిలే ! అల్లుడా. ఆకుర్ర కొర్నాసెదవా నేను పదరా అన్నప్పుడు బయటాదేరక పడగ్గదిలోకి దూరాడు... పాపం, అడిగతేవయిండే ! పిల్లనాయాళ్ళకు ఉబలాటవేగాని టయింవు గ్యానం తక్కువలే, అల్లుడా... ఏం చిద్రంవయ్యా. ఎగస్ట్రా యాసాలేస్తుండావా ? మీ పని వాటంలే," అన్నాడు గవరయ్య మావ చతికిలబడుతూ.

"ఏం వాటంలే, మాఁవా ? పుస్తకా లేస్తున్నాంగా, మోత ! మోతనుకో ! పుస్తకం చెల్లగా పుస్తకం. పుస్తకం చెల్లగా పుస్తకం—ఇప్పటికి రెండు పుస్తకాలేశాం. చెరొక పదీ సంపాయించుకున్నాం." అన్నాడు భద్రం.

"హో—య్ !" గురవయ్యమావ ఇల్లదిరేటట్టు నవ్వాడు. 'పదా !' అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"నువు నవ్వుతావుగాని, మాఁవా, పుస్తకం మూడేలు, నాలుగేలు వారం లోపల పైసలా అయిపోతున్న దనుకో. అట్ట ప్రెస్సునించి కాపీలు తీసుకోవటం ఇట్ట కాటా యేసి అమ్మెయటం! కాంప్లీ కాపీకూడా లేకుండా పోయిందంటే నమ్ము !" అన్నాడు భద్రం.

''మరి నీ డిటెక్ప నేమాయె ?'' అన్నాడు గవరయ్యమావ వాకేసి మీసాలతో చూసి.

''తప్పు భద్రందే, మావా ! అంతకుల్ని పట్టుకోవటం మనకు గిట్టుబాటు కాదన్నాడు.''

''ఆయ్ !''

''కేసులు పట్టమని మన నెవరన్నా పిలిస్తేనే అంతంతమాత్ర మన్నాడు.''

''ఆయ్ !''

''ఒకేల అంతకుణి తరిమిపట్టినవాణ్ణి ఏం చెయ్యాలో మనకు తెలవదన్నాడు.''

''సూడో, అదే యెర్రిమాట. నువు అంతకుణ్ణి పట్టాలేగాని ఎంత డబ్బయినా రాల్తది. 'ఇదుగో, నిన్నుపోనిస్తే ఎవిస్తావ్ ?' అంటే ఆ యాలంపాటంతా ఆడే పాడేస్తాడుగా!... అయినా, సూడో ! ఇప్పుడు నీ అంతకుడంటే ఏవిటనుకుంటుండావో, అల్లుడా ! అంతా సవిన్సనుకో సవిన్సు !...

''అదెట్టా మావా !'' అన్నాను హాశ్చర్యంతో. ఈసయింసు సంగతి నే నెన్నడూ వినేలేదు.

''ఇదిగో సూడో ! నేనే ఉండాననుకో. నన్ను డిటెక్టివు నాకొడుకును పట్టమనో !''

''పట్టలేడేం ?''

''అ డబ్బుతరం గాదనుకో ! అంతా సవిన్సు నే నేంతెప్తానో తెలుసా ? అది యెనకా ఇతే ఓ మంత్రగబ్బనొదుల్తా. సూడో, అదు తారెక్కి నాకోసం అమరావతి కెల్లనీగాక ఆ మంత్ర

గబ్బ ఆ డెంటపడి ఆ డెక్కడాగితే అక్కడ లటుక్కున కాటేస్తది. దాంతో వాడు ఖాళీ !"

"అబ్బా !" అన్నా.

"అదెట్టాగని అడుగో! అది నిజమైన మంత్రగబ్బ అనుకుంటావా? వొట్టిది; ఒక చచ్చిన మంత్రగబ్బ తీసుకో. ఇంత సూదంటురాయి తీసుకుని మూడు పుటాలేసి బస్మం చెయ్యి. చచ్చిన మంత్రగబ్బకు దాన్ని పూసి డిటెక్టివు కాపర్లో యెళ్లేదారిలో వొదిలెయ్యి. కాపర్లో యినుపుంటది. సూదో అది ఆకర్షించనుమ్మా, మంత్రగబ్బ అదేమైన కారెంబడి పరిగెత్తి డిటెక్టివు నాకొడుకును లటుక్కున కాటేస్తది. అయిందా ?"

"ఆయ్ !" అన్నాను హత్యాశ్చర్యంగా.

"డిటెక్టివుగాడు ఓగదిలో కూకుంటాడా? ఆడి గది కప్పులో—అదేందీ? టెలిస్కోపా. రేడియోఫోనా?— అది పెట్టేస్తా. అవేంజేస్తవీ? ఆడు అనే మాటలన్నీ పోకసుజేసి గొట్టంలోంచి నా దగ్గిరికి పంపిస్తది! ఇంకేంవుందీ ! ఆడి ఆట కట్టే ?"

"అబ్బా" అన్నాను మళ్ళీ.

"ఇప్పుడు సవిస్సు ఎక్కడ ఎవరు జెప్పుకున్నా మహ శెద్ధగా యింటుండాలే అల్లుడా! సూడో, మనిషి చచ్చినాక అరగంటదాకా పేణం పోకుండా ఉండొచ్చుట. ఇంకేవుందీ ? డిటెక్టివు నాకొడుకు సచ్చాడన్నమాటే. ఒకణ్ణి గుండేసి కొట్టి సంపేసి ఆడికి ఇంజకస నిచ్చేసి నాదారిననేపోతా. గుండేసిన సప్పుడిన్న రిక్సావాడు గోడకింద డిటెక్టివుకోసం కనిపెట్టుకుని అట్టనే ఉంటడు. వాడి సేతిగడియారంలో సరిగా ఏడూ ఇరవై రెండు ముక్కాలయుంటది. ఆయ్? తరవాత ఏడూ ఇరవై ఆసంగాయిను నేనా పక్కసందుగా పోతుంటే చింతచెట్టుకింద నిలబడి సూసిన ఆకుపచ్చసీరె మడిసి చింతచెట్టుక్రింద అట్టనే నిలబడి సేతిగడియారం సూసుకుని డిటెక్టి వెప్పుడొస్తడా అని చూస్తూంటది.

"రాత్రి తొమ్మిదిన్నరేల డిటెక్టివు పూటుగా కాపీతాగి, పూటుగా అమ్మాయిని వాటేసుకుని కేసు యిప్పటాని కొస్తడు. ఆయ్? ఇంకేం, గోడకింద రిక్సావాడు డిటెక్టివును సూత్తానే, "ఏడూ ఇరవై రెండు ముక్కాలు!" అని చెప్పేసి టీనీళ్లకూ్కడా డబ్బులడక్కుండా రోజల్లా బాడిగలు పోగొట్టుకుని, గుడిసెక్కు రిక్సా యీడ్చుకుపోయి డొక్కలో కాళ్లెట్టుకుని తొంగుంటడు. ఆయ్? పక్కసందులో చింతచెట్టుకింద ఆకుపచ్చ సీరెగట్టిన కూతురు, 'ఏడూ ఆరుంగాలు! బుర్రమీసాలు! ఒక కాలు కాస్త జవుకు.' అని చెప్పేసి ఇంటికెల్లి పొయిరాజేసి, ఆలిస్యంగా ఇంటికొచ్చినందుకు మొగుడిచేత తన్నులు తింటది. ఆయ్?

"చివర కేవవుద్దీ? అమ్మాయి మారేసాలేసుకుని గుంటకల్లూ, సెదలవాడా అంతా తిరిగి ఏందేందో రాసుకొస్తుంది. డిటెక్టివు దాన్ని వాటేసుకుని ఆ రాసుకొచ్చిందంతా చదువుకుని, టెలిఫోనెత్తి ఇనస్పెటరుతో ఈ పనిచేసింది ఎల్లమందో ఆరుముగవో అని మీరు పొరపాటు పడుతున్నారల్లే ఉంది. ఇది గవరయమ్మావ పనే అవటా అని చెప్పేస్తాడు. కాని ఏం లాభం? గవుర్మెంటు సరిజెనొచ్చి అత్యాజ్జరిగింది. ఏడు యాభై రెండుంగాలు కన్ని

చెప్పేస్తాడు. ఏడుముప్పైకి ఎనిమిదికీ మద్దె గవరయ మావ ఎక్కడుండాడూ? అల్లుడితోనూ భద్రంతోనూ బాతాఖానీ కొడతా ఉండాడు. ఇంకేం కేసూ? పైసలా! డిటెక్టివు ఖాలీ!... అన్నట్టు ఎనిమిది కొట్టిందా, అల్లుడా?''

గవరయమావ ఆ మాట అడుగుతుండగానే గడియారం ఎనిమిది కొట్టింది.

గవరయమావ లేచి నిలబడి, ''యెల్లొస్తా, అల్లుడా! నాకోసం ఎవరన్నావస్తే అర గంటమించి ఇక్కడే ఉండి, అట్ల గుడికేసి ఎల్లానని సెప్పో!" అంటూ కుంటు కుంటూ వెళ్ళిపోయాడు.

ఆలోచిస్తున్నాను, సయించు డిటెక్టివు.

''భద్రం? మనం ఇక రాస్తే సయించు కధలే రాయాలి!'' అన్నాను.

భద్రం ఆలోచన ఎక్కడుందో మరి. ఉలిక్కిపడ్డట్టుగా ''ఏంది, గురో?'' అన్నాడు.

ముద్రణ : కొడవటిగంటి కుటుంబరావు కథలు సంపుటి నుంచి,
జయా పబ్లికేషన్స్ : విజయవాడ.